క్లుప్తంగా

నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సత్యసాయి సేవాసంస్థల ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ అన్నారు. గురువారం స్థానిక రామకృష్ణాపురంలోని సత్యసాయి సేవాకేంద్రంలో 100 మంది విద్యార్థులకు ఆయన చేతులు మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సత్యసాయి సూచించిన మార్గంలో నడుచుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. అందర్నీ ప్రేమించు, అందర్నీ సేవించు అనే సాయి సూక్తి స్ఫూర్తిదాయకం అన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలోనూ తమ సంస్థల ద్వారా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పైడేటి రామారావు, కె.వెంకటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, సోడిశెట్టి శాంత కుమార్, పాలడుగు శ్రీరంగం, విద్యార్థుల తల్లిదండ్రులు, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన పీజీ సెట్ 2024లో వివిధ సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకాం విభాగంలో ఎస్ శ్యామ్ నాగఅచ్యుత్ 49వ ర్యాంకు, ఎంఎస్సీ జువాలజీ విభాగంలో కె.నవీన్ కుమార్, పి.దుర్గాప్రసాద్, పి.దుర్గా భాను గాయత్రి, బి.స్మితా బ్లెస్సీ, కె.స్వాతి, టి.శిరీష వరుసగా 68, 260, 455, 500, 627, 747 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఎంఏ ఎకనామిక్స్‌లో కె.రమ్యకృష్ణ 159, ఇంగ్లిషులో ఎం అనూజ 119 ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరిని తీర్చిదిద్దిన అధ్యాపకులు ఎం విజయకుమార్, వి.వెంకట్రావు, ఎం రాంబాబు, ఎస్ సుస్యలత, ఎన్ కరుణలతలను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. 2024–25వ విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చేరదలుచుకున్న విద్యార్థులు తమ కళాశాలలో సంప్రదించవచ్చని కోరారు.

సెల్‌ఫోన్‌తో ప్రయోజనాలెన్నో!

- ప్రత్యేక యాప్‌లతో సమాచారం
- నిత్యం వాతావరణ అంచనాలు
- యాప్స్‌తో వర్షం, పిడుగుల సమాచారం



రెయిన్ అలారమ్ యాప్

ఏలూరు టౌన్ : నేడు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుత ప్రగతిని సాధించడంతో మనిషి మనుగడకు అవసరమైన అనేక ప్రయోజనాలు అరచేతిలోకి వచ్చేశాయి. పూర్వం వాతావరణ సమాచారాన్ని తెలుసుకోవాలంటే అసాధ్యమనే చెప్పాలి. నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ముందుగానే వాతావరణ పరిస్థితులను తెలుసుకునే సౌలభ్యం వచ్చింది. చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు.. ప్రపంచాన్నే కాదు.. అంతరిక్షాన్ని సైతం చుట్టేసే ఆధునిక యుగంలో ఉన్నాం. వర్షం కోసం ఆకాశం వైపు చూడటం మాని, అరచేతిలోనే సెల్‌ఫోన్‌లోని యాప్స్‌ను అడిగితే చాలు. ఒకరోజు కాదు.. వారం రోజుల సమాచారాన్ని సైతం అందిస్తుంది. ఇక రైతాంగానికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు నేడు అనేక యాప్స్ సెల్‌ఫోన్‌లో అందుబాటులోకి రావడంతో రైతన్న నష్టపోకుండా మేలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి.

వ్యవసాయానికి ఊతం


దేశానికి వెన్నుముక రైతన్న అనేది వాస్తవం. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి నేడు సాగునీరు అత్యవసరం. విత్తు నాటడం మొదలు పంట విక్రయాల వరకు రైతన్నకు అడుగడుగునా అనేక సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. వీటిలో ప్రధానంగా వాతావరణ పరిస్థితులు నిత్యం గమనిస్తూ వాటికి అనుగుణంగా ఆరుగాలం పంట పండించేందుకు రైతన్నపడే కష్టానికి చేదోడుగా వాతావరణ పరిస్థితులను తెలియచేస్తూ కేంద్రం అనేక యాప్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వర్షాలు, పెనుగాలులతో అనేక సార్లు రైతన్న తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటూ ఉంటారు. ఇక పిడుగుపాటు ప్రమాదాలు, రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెలు, పశువుల కాపరులు, గ్రామాల్లో పంట పొలాల్లో తిరిగే వారు ప్రమాదాలకు గురై విగతజీవులుగా మారే పరిస్థితులు నిత్యం చూస్తున్నాం. ప్రాణం పోవడంతో పాటు విలువైన పశుసంపదను సైతం పిడుగుపాటు కారణంగా కోల్పోవడం తీవ్ర నష్టానికి గురి చేస్తుంది.

మేఘదూత్‌తో..

పంటసాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం వరకు, పంట నూర్పిడి సమయంలోనూ వర్షం తీవ్రంగా రైతులను నష్టానికి గురి చేస్తుంది. ఇలాంటి నష్టాల నుంచి రైతు బయటపడేందుకు మేఘదూత్ యాప్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. వారం ముందుగానే వాతావరణంలో మార్పులు, వర్షపు సూచనలు సహా, ఆకాశంలో మేఘావృతం అవుతుందా లేదా అనే అంశాలతో పాటు గాలుల దిశలను సైతం తెలియచేయడం, వాతావరణంలో తేమ శాతం ఉష్ణోగ్రతల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

రెయిన్ అలారం యాప్

గూగుల్ ప్లేస్టోర్‌లో రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా మనం నివసించే ప్రాంతానికి సుమారు 20 కిలో మీటర్ల పరిధిలో ఎక్కడ వర్షం పడే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.



వజ్రపాత్..

గూగుల్ ప్లే స్టోర్ నుంచి వజ్రపాత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమవైపు పిడుగుపాటు సమాచారం కనిపిస్తాయి. అక్కడ నొక్కితే మనం ఉండే ప్రాంతంలో సహా పూర్తి మ్యాప్ ఫోన్‌లో కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్‌లో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8,15,30 అంకెలుంటాయి. ఈ అంకెల మేరకు ఎంత దూరంలో పిడుగుపడే అవకాశం ఉందో గుర్తించే అవకాశం ఉంటుంది. యాప్ కుడిభాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది.

ముందుగానే జాగ్రత్తపడవచ్చు



రైతులతో పాటు ప్రజలకు సైతం అతిసులువుగా వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో అనేక నూతన ఆవిష్కరణల నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను నిత్యం గమనించేందుకు అనేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. విత్తనాలు వేసుకోవడం, పురుగు మందులు పిచికారి చేయడం, రసాయనిక ఎరువులు వినియోగించే సమయంలో వర్షం కారణంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అయితే యాప్‌ల ద్వారా వర్షపు సూచనలు తెలుసుకుని ముందుగానే జాగ్రత్త పడవచ్చు. అదే విధంగా పిడుగుపాటుకు గురికాకుండా ముందస్తు సమాచారంతో ఆ ప్రాంతానికి దూరంగా వెళితే ప్రాణం రక్షించుకోవడంతో పాటు పశుసంపదను సంరక్షించుకోవచ్చు.

– ఎస్ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయశాఖాధికారి

అభ్యుదయవాది రంగారావుకు నివాళి



రంగారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ప్రముఖ అభ్యుదయవాది, వామపక్ష అభిమాని బొమ్మి రంగారావు ఆశయాలను ఆదర్శంగా తీసుకుని కొత్తపేటలో ప్రజా సమస్యల పరిష్కారానికి, బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయ అభివృద్ధికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. స్థానిక కొత్తపేటలో ఏఐవైఎఫ్ నిర్వహిస్తున్న బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయం వద్ద బొమ్మి రంగారావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని ట్రస్టు కార్యదర్శి చింతల సూర్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. రంగారావు చిత్రపటం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య నివాళులర్పించారు. కృష్ణ చైతన్య, ఉప్పులూరి హేమ శంకర్, రంగారావు తనయుడు బొమ్మి మురళి, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మాజీ నాయకులు ఎస్ సంజీవరావు, మాజీ కార్పొరేటర్ ఆర్నేపల్లి మధులు మాట్లాడారు. స్థానిక నరసింహా మున్సిపల్ ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీల్లో పిల్లలకు పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు, పలకలు అందజేశారు.

ఏలూరు డిప్యూటీ కమిషనర్ రాధ బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎన్ రాధను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్‌ను డీఎంఏకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. గత కొంతకాలంగా ఏలూరు నగరంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రాధను తాజాగా బదిలీ చేశారు.

విద్యారంగ సమస్యలపై వినతి



ఉప విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు ఇన్‌చార్జి ఉప విదాశాఖాధికారి అల్లూరి ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అంశాలు వారీగా సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ సర్వేలో తమ దృష్టికి అనేక అంశాలు వచ్చాయని, ప్రధానంగా విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు వారాలు కావస్తున్నా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందలేదని, విద్యాకానుకలో ఇచ్చే యూనిఫాం, షూ, బ్యాగులు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్ట్ బోధించే ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. వెంటనే ఐటీ సబ్జెక్టు ఉన్న పాఠశాలకి ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో 12–1(సీ) లో భాగంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు అవకాశం కల్పించిన నేపథ్యంలో, ఆయా విద్యార్థులను సెకండ్ క్లాసులోకి ప్రమోట్ చేయాలంటే మొదటి క్లాసులో ఫీజు కట్టాలని ఆయా విద్యా సంస్థలు తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని, అటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నాయకులు సీహెచ్ విష్ణు, డి.రాజేష్, ఎం క్రాంతి, యు.మణి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కమిషనర్ చంద్రయ్యకు కోర్టులో చుక్కెదురు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రయ్యకు న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన మచిలీపట్నంలో పనిచేసిన కాలంలో ఒక కేసు విషయంలో న్యాయస్థానం ఆదేశాలను పాటించకపోవడంతో కోర్టు సీరియస్ అయింది. ఆయనకు ఆరు నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే దీనిపై ఆయన సమాధానం ఇచ్చేందుకు న్యాయ స్థానం మరికొంత సమయం ఇస్తుందని, అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్ల సమస్యలు పరిష్కరించండి



మంత్రి అనితకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ (పీటీఎల్‌యూ) నాయకులు హోమ్ మంత్రి వంగలపూడి అనితను కోరారు. శుక్రవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలిసిన పీటీఎల్‌యూ నాయకులు ఆమెకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పీటీఎల్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేడ్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టు శ్యామ్ ప్రసాద్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు రవిబాబు ఉన్నారు.

27న కాకినాడలో వర్క్‌షాప్

దెందులూరు: కాకినాడలో జూలై 27న నిర్వహించనున్న సమావేశానికి న్యాయవాదులు, మేధావులు, జర్నలిస్టులు తరలిరావాలని అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఏఏఎఫ్) వర్క్‌షాప్‌నకు ఆహ్వానిస్తుందని ఏఎఫ్ చైర్మన్, న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ అన్నారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా దెందులూరులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు.

అల్లూరి త్యాగాన్ని అందరూ అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని అందరూ అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు అన్నారు. జూలై 4వ తేదీన అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని 127 సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాలను శుక్రవారం నగరంలో ప్రారంభించారు. స్థానిక సత్రంపాడులోని సిద్ధార్థ విద్యాలయంలో వారోత్సవ కార్యక్రమాన్ని రాము సూర్యారావు ప్రారంభించారు. అనంతరం సత్రంపాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో సూర్యారావు మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం మరణించిన అల్లూరి సీతారామరాజు ధైర్యంతో, త్యాగనిరతితో విద్యార్థులు కష్టపడి చదవాలని, సమాజాన్ని పరిశీలించాలని సూచించారు. ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు, అపార్టమెంట్లలు, వాకర్స్ గ్రౌండ్లలో, స్టడీ సెంటర్స్‌లో శుక్రవారం నుంచి జూలై 4వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జీవితంపై డ్రాయింగ్ పోటీలు, ఏకపాత్రాభినయం పోటీలు, వేషధారణ పోటీలు, లఘు నాటిక, ఉపన్యాసం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జూలై 3,4 తేదీల్లో స్కూల్స్, కాలేజీల్లో సభలు ఏర్పాటుచేస్తామని, 127కు పైగా సంఘాలకు సంబంధించిన పెద్దలు ఆయా సభల్లో అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అనంతరం సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జీవితం, మన్య విప్లవంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఆర్ఆర్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు పి.ఆంజనేయులు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్స్ జిల్లా కార్యదర్శి ఎం యామిని, బీఏ సాల్మన్ రాజు, సిస్టర్ శాంతమ్మ, ఆర్ శ్రీనివాస డాంగే, బి.అలేఖ్య, పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సమస్యలను పరిష్కరించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనతో సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. పాత ఇందిరమ్మ కాలనీలు, జగనన్న కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీ పూర్తిగా రూపుదిద్దుకోలేదని, ఈ నేపథ్యంలో ఏలూరులో ఏరియా ఆసుపత్రిని (సెకండ్ రిఫరల్) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారపు పేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని, నగరంలో పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద, వన్ టౌన్, టూ టౌన్ ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. పవర్‌పేట అండర్‌పాస్‌లో నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, కుమ్మరి రేవు, సుందరయ్య కాలనీ, అన్నే నగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కొత్తూరు జూట్ మిల్లును ప్రభుత్వమే నడిపించేలా చర్యలు చేపట్టాలని, ఏలూరు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరులో కుక్కలు, పందులు, దోమల బెడదను అరికట్టాలని, పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని కోరారు. రాత్రి సమయాల్లో నేషనల్ హైవే మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సులను ఏలూరు నగరంలోపల నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, సుబ్బమ్మ దేవి హైస్కూల్ గ్రౌండ్ స్థలాన్ని ఆ స్కూల్‌కు స్వాధీన పరచాలని కోరారు. కార్పొరేషన్‌లోని మురికివాడల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు గ్రామాల ప్రజలు తాగేందుకు గోదావరి జలాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చంటి హామీ ఇచ్చారని కిషోర్ తెలిపారు. సమావేశంలో సీపీఎం నగర నాయకులు వి.సాయిబాబు, గొట్టాపు రవి కిషోర్, కె.రామాంజనేయులు, బి.జగన్నాథరావు, వీవీఎస్ ప్రసాద్, ఎం అరుణకుమారి, సీహెచ్ రాజ్యలక్ష్మి, జి.శారద తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి



సుంకరవారితోట ఆర్‌బీకే వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఏలూరు రూరల్ : ప్రభుత్వం ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం సుంకరవారితోట రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు, కౌలురైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రబీ ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి రెండు నెలలు అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటికీ సొమ్ము చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పౌరసరఫరా కార్యాలయం అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. రైతులకు రూ.240 కోట్లు ధాన్యం సొమ్ములు చెల్లించాల్సి ఉందన్నారు. ఖరీఫ్ సాగులో విత్తనాల కొనుగోలుకు డబ్బు లేకపోవడంతో పెట్టుబడి సొమ్ములు కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబి పంట సాగు పెట్టుబడి అప్పులు పెరిగిపోతున్నాయన్నారు. గతంలో చేసిన అప్పులు చెల్లించకపోవడంతో ఖరీఫ్‌లో రైతులకు అప్పు ఇచ్చే నాథుడే కానరావడం లేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు సార్వా చేయలేని నిస్సాహయ స్థితిలో ఉన్నారని వివరించారు. అనంతరం రైతులు బైరెడ్డి లక్ష్మణరావు, చిన్ని పోతురాజు, అన్నంరెడ్డి రంగారావు, ఎ.నాగరాజు, ధర్మవరపు రాము, ధర్మవరపు చిన్ని తదితరులు రైతు భరోసా కేంద్రం అధికారికి వినతిపత్రం అందజేశారు.

అప్రమత్తతతోనే అతిసారానికి చెక్

- వర్షాకాలంలో అతిసార వ్యాప్తి
- అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయం

భీమడోలు: వర్షాకాలంలో ప్రబలే ప్రాణాంతక వ్యాధుల్లో అతిసారం (డయేరియా) ఒకటి. ఆ వ్యాధి బారిన పడిన వారు నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాప్రాయానికి దారితీస్తుంది. వ్యాధి కారకాలు, ముందుస్తు జాగ్రత్తలపై ప్రజలంతా అవగాహన కలిగి జాగ్రత్తలను పాటిస్తే నిర్మూలన సాధ్యమవుతుంది. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు తాజా, వేడి ఆహార పదార్థాలు భుజించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలను అనుసరిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని వైద్యులు అంటున్నారు. ఈ సీజన్‌లో పలు చోట్ల డయేరియా కేసులు నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి చైతన్యవంతం చేస్తున్నారు. ఈ వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి వివరించారు.

డయేరియా లక్షణాలు

విరేచనాలు నీరు మాదిరిగా, పలుచగా అవుతుంటే అతిసారం సోకినట్లు గుర్తించాలి. వైద్య పరిభాషలో గ్యాస్ట్రో ఎంటిరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణ వ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70 శాతం వైరస్ వల్ల వస్తాయి. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినకూడదు. తింటే వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి. కడుపులో మెలిపెట్టినట్లు నొప్పిగా ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. శరీరంలోంచి అధిక మొత్తంలో నీరు బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. నీరసంగా ఉండడం, నోరు, నాలుక పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండిపోవడం, మూత్రం అసలు రాకపోవడం లేదా తక్కువగా రావడం, ముదురు పసుపు రంగులో మూత్రం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వయస్సుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ ఏర్పడి పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం సంభవిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డయేరియా సోకే కాలంలో క్లోరిన్ కలిపిన నీటిని విడిగా తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగినా మంచిదే. కుండ లేక బిందెల్లో చేతులు ముంచి మంచి నీటిని తాగరాదు. కాడ గిన్నెతో నీటిని గ్లాసుల్లో పోసుకుని తాగడం మంచిది. కలుషితమైన నీరు తాగరాదు. మంచినీటి పైపులైన్ మరమ్మతులను విధిగా చేయించుకోవాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతి పంపులు, కుళాయిల చుట్టూ ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించాలి. నిల్వ ఉన్న మాంసాహారంతో పాటు ఎలాంటి పదార్థాలను తీసుకోవద్దు. ఆహార పదార్థాలపై మూత ఉంచాలి. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత విధిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడడం అలవాటు చేసుకోవాలి. మంచినీటి చెరువు, మంచినీటి బావులు వద్ద బట్టలు ఉడకడం, పశువులు కడగడం చేయరాదు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. సూక్ష్మజీవులు చేరకుండా పరిసరాల్లో చెత్త కుప్ప, పేడ నిల్వ ఉండరాదు. ఈగలతో పాటు ఇతర కంటికి కనపడని కీటకాలు సైతం చేరకుండా ఉండేందుకు వంట పాత్రలతో మూతలు ఉంచాలి. మాంసం, కూరగాయాలు, ఫలాలు వినియోగించే ముందుకు కడగాలి. గోళ్లను ఎక్కువగా పెర గనివ్వరాదు. ఏ ప్రాంతంలోనైనా అతిసారం ఉన్నట్లయితే ఆ ప్రాంత పరిధిలోని ప్రభుత్వ వైద్యులకు సమాచారం అందించాలి.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	34
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21,.15	4822	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.10	98503	00
ఏలూరు – తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05, 07
బెండకాయలు	32	కంద	64
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	44–54	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	108
బీరకాయలు (పందిరి)	64	అల్లం	180
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34–52	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	64	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణీ	--
అనపకాయ (1)	10–15	క్యాప్సికమ్	88
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	54